




# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 23-07-2024 సంపుటి : 06 సంచిక : 307 పేజీలు : 8 వెల : రూ


# రాజధాని హైదరాబాద్‌ను కోల్పోయాం..

## రాష్ట్ర విభజనతో ఏపీకి తీవ్ర నష్టం
## ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్



అమరావతిజులై22 ( విభారె ప్రతినిధి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను అశాస్త్రీయంగా విడదీశారని ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. భాగస్వాములతో చర్చలు చేయకుండా విభజించారని చెప్పారు. ఉమ్మడి ఏపీ విభజన రాష్ట్ర ప్రజల హృదయాల్లో మాయని మచ్చగా మిగిలిందని తెలిపారు. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ వల్ల అల్లకల్లోలం ఏర్పడిందన్నారు.రాష్ట్ర ప్రజలు సుదీర్ఘకాలం అభివృద్ధి, పురోగతికి నోచుకేలదని చెప్పారు.ఆంధ్రప్రదేశ్‌శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. రాష్ట్ర విభజన వల్ల ఏపీకి నష్టం ఏర్పడిందన్నారు. రాజధాని హైదరాబాద్‌ను కోల్పోయామని చెప్పారు. తద్వారా ఆర్థిక నష్టం జరిగిందన్నారు'కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి శుభాకాంక్షలు. ఆంధ్రప్రదేశ్ సమ్మిళిత అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. 2014లో ఏపీ అభివృద్ధికి చంద్రబాబు తీవ్రంగాకృషిచేశారు. 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో పెట్టుబడుల వరదకొనసాగింది. అనేకసంస్థలురాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకొచ్చాయి. ఆ తర్వాత 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి రాష్ట్రంలో అన్ని రంగాలు నష్టాలు చవిచూశాయి. చంద్రబాబు హయాంలో వచ్చిన పెట్టుబడిదారులు వెనక్కి మళ్లారు. 2019-2024 మధ్య కాలంలో రాష్ట్రం అప్పుల ఊబిలోకి వెళ్లింది. విభజన చట్టం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తగినంత పరిహారం ఇవ్వలేదు. ఆస్తులు, అప్పుల పంపిణీలో అసమానతలు ఉన్నాయి. అశాస్త్రీయ విభజన వల్ల 46 శాతం వనరులు మాత్రమే వారసత్వంగా వచ్చాయి. రాజధాని హైదరాబాద్‌ను కోల్పోవడం వల్ల ఆర్థిక నష్టం జరిగింది. భారీ రెవెన్యూలోటువారసత్వంగా వచ్చింది. ప్రాంతం ఆధారంగా ఆస్తులు..వినియోగం ఆధారంగా విద్యుత్ పంపిణీ చేశారు. ఎలాంటి ఆధారాలులేకుండావిద్యాసంస్థలువిభజించారు. ఉన్నత విద్యాసంస్థలు కోల్పోయాం. ఉమ్మడి ఏపీలో తలసరి ఆదాయం లక్షా 6 వేల 176 కోట్లు. విభజిత ఏపీలో తలసరిఆదాయం 93 వేల 121 కోట్లకు పడిపోయింది. రాష్ట్రవిభజన వల్ల ప్రతికూల ప్రభావం పడింది. అపరిష్కృత సమస్యల వల్ల సవాళ్లు వచ్చాయి. విభజన వల్ల ఏర్పడిన సంక్షోభాన్ని చంద్రబాబు ప్రభుత్వం అవకాశంగా మలచుకుంది సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు ప్రభుత్వం పునాది వేసింది. సముద్ర తీరం, నౌకాశ్రయ ఆధారిత అభివృద్ధిపై చంద్రబాబు ప్రభుత్వం దృష్టి సారించింది. తయారీ కార్యకలాపాలకు అవసరమైన వాతావరణంపై చంద్రబాబు ప్రభుత్వం దృష్టి సారించింది. 2014-19 మధ్య కాలంలో అభివృద్ధి, సంక్షేమం మధ్య స్పష్టమైన సమతుల్యం ఉంది. గోదావరి, కృష్ణా నదుల అనుసంధానంతో పట్టిసీమ రికార్డు సమయంలో పూర్తయింది. ఏడాది సమయంలోనే చంద్రబాబు ప్రభుత్వం పట్టిసీమ పూర్తిచేసింది. చంద్రబాబు హయాంలో పోలవరం ప్రాజెక్టు 72 శాతం పూర్తయింది. ఇతర నీటి పారుదల ప్రాజెక్టులకు చంద్రబాబు ప్రాధాన్యత ఇచ్చారు. కరవు నివారణ చర్యలు, రియల్‌టైమ్ గవర్నెన్స్ చేపట్టారు. భూసేకరణ ద్వారా అమరావతి ప్రాంత అభివృద్ధి చేశారు. కొత్త సచివాలయం, శాసన సభ భవన నిర్మాణం చేశారు. చంద్రబాబు దూరదృష్టి నాయకత్వం వల్లే 2014-19 మధ్య అభివృద్ధి సాధ్యమైంది.' అంటూ గవర్నర్ తన ప్రసంగాన్ని ముగించారు. అయితే గవర్నర్ ప్రసంగాన్ని వైసీపీ సభ్యులు అడ్డుకున్నారు. తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో వెనకబడిపోయిందన్న వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. హత్యా రాజకీయాలు నశించాలి.. సేవ్ డెమోక్రసీఅంటూ నినాదాలు చేశారు. అయినాగవర్నర్ ప్రసంగం కొనసాగడంతో.. నిరసగా విపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభ నుంచి వాకౌట్ చేశారు. కాగా, గవర్నర్ ప్రసంగం ద్వారా తెలంగాణపై తన దుర్బుద్ధిని చంద్రబాబు మరోసారి బయటపెట్టుకున్నారని తెలంగాణ వాదులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

# ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్..




దిల్లీ: జులై22 కేంద్రమంత్రి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి మంగళవారం బడ్జెట్ సమర్పించనున్న వేళ సోమవారం ఆర్థిక సర్వేను సభ ముందుంచారు. దీంతో పాటు గణాంక అనుబంధాన్ని కూడా సభలో ప్రవేశపెట్టారు .బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. గతసంవత్సరకాలంలో దేశ ఆర్థిక పనితీరును.. రాబోయే సంవత్సరంలో ఆర్థికంగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి చెప్పేదే ఈ ఎకనమిక్ సర్వే. ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన ఎకనామిక్ అఫైర్స్ డిపార్ట్‌మెంట్‌లోని ఎకనమిక్ డివిజన్ ఈ సర్వేను రూపొందిస్తుంది. తొలుత 1950-51 సంవత్సరం సర్వేను బడ్జెట్‌తో పాటే ప్రవేశపెట్టేవారు. 1960 తర్వాత బడ్జెట్‌కు ఒక రోజు ముందు ప్రవేశపెట్టే సంప్రదాయం మొదలైంది.

**ఆర్థిక సర్వేలోని ముఖ్యాంశాలు :** 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశ ఆర్థికం 6.5 నుంచి 7 శాతం వృద్ధిని నమోదు చేయొచ్చు.

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు కొనసాగినా దేశీయ వృద్ధి చోదకాలు ఆర్థికానికి అండగా నిలిచాయి.

దేశంలో ఆర్థిక వ్యవస్థ మున్ముందు వృద్ధిలో ముందుకు దూసుకెళ్లనుంది.

అంతర్జాతీయ భౌగోళిక పరిణామాలు, వాటి ప్రభావం ఆర్‌బీఐ ద్రవ్య విధాన నిర్ణయాలను ప్రభావితం చేయొచ్చు.

ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది.

కార్పొరేట్, బ్యాంకింగ్ బ్యాలెన్స్ షీట్స్ బలంగా ఉన్నాయి. ప్రైవేటు పెట్టుబడుల వృద్ధికి ఇది దోహదం చేస్తుంది.

భారత వృద్ధిలో క్యాపిటల్ మార్కెట్‌లది కీలకపాత్ర. భౌగోళిక రాజకీయ, ఆర్థిక పరిణామాలను తట్టుకోలదని ఆర్థిక సర్వే అభిప్రాయం.


పెరిగినచైనాఎఫ్‌డీఐలుప్రపంచంలోభారతసప్లయ్ చైన్‌లో భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు ఎగుమతులకు ఊతమివ్వడానికి సహాయపడుతుంది.

దేశంలో నిరుద్యోగిత తగ్గుముఖం పట్టింది. 2022-23 నాటికి నిరుద్యోగిత రేటు 3.2 శాతానికి తగ్గింది.

ఆటోమొబైల్ రంగంలో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం వల్ల రూ.67,690 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. ఇందులో రూ.14వేల కోట్లు కార్యరూపం దాల్చాయి

# తప్పులు చేయడమే జగన్ నైజం

## అప్పటి నాటకాన్నే జగన్ మళ్లీ మొదలుపెట్టారు:
## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
## తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు
## కూటమి నేతల సమావేశంలో సిఎం బాబు ప్రకటన



అమరావతిజులై22( విభారె ప్రతినిధి):: అక్రమ కేసులు ఎదుర్కొని 53రోజులు జైల్లో ఉన్నానని సీఎం చంద్రబాబు తెలిపారు. కక్ష సాధింపు చర్యలకుదిగాలంటే ముందుండాల్సింది తానేనని.. కానీ ప్రజలు మనల్నిఅందుకోసంగెలిపించలేదనేవిషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో నిర్వహించిన కూటమి నేతల సమావేశంలో మాట్లాడారు. దాదాపు గంటన్నరపాటు సమావేశం సాగింది. ఇందులో ఇసుక,శాంతి భద్రతలపై ప్రధానంగా చర్చిం చారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ "శాంతిభ ద్రతలకు ఎవరు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదు. తప్పు చేసిన వారిని చట్టప్రకారమే కఠినం గా శిక్షిద్దాం. వివేకా హత్య కేసులో నడిపిన నాటకాన్నే జగన్ మళ్లీ మొదలు పెట్టారు. వినుకొండ వ్యవహారం లో అదే కుట్ర చేస్తున్నారు. ప్రభుత్వం వచ్చి నెల రోజులు కాలేదు.. అప్పుడే విమర్శలా? గవర్నర్ ప్రసంగాన్ని తొలిరోజే అడ్డుకోవడం సరైన పనేనా? తప్పులు చేయడం.. పక్కవారిపై నెట్టేయడం జగన్‌కు అలవాటు. వివేకా హత్య విషయంలో ఇతరుల పైకి నెపం నెట్టేసే ప్రయత్నం చేశారు" అని అన్నారు. ఇసుక జోలికి వెళ్లొద్దని ఎమ్మెల్యేలకు సీఎం సూచించారు. ఇసుక ధరల విషయంలో కొన్ని ఇబ్బందులు వస్తున్నాయని పలువురు ఎమ్మెల్యేలు ఆయనకు తెలిపారు. ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేద్దామని.. దీనిపై మరిన్ని సూచనలు ఉంటే చెప్పాలన్నారు. డబ్బుల్లేవని పనులు ఆపలేమని.. ఇబ్బందులున్నా ముందుకెళ్లాలన్నారు. ముందుగా రోడ్లకు పడిన గుంతలు పూడ్చే కార్యక్రమం చేపడదామని చెప్పారు. మూడు పార్టీల మధ్య సమన్వయం అంశాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రస్తావించారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు తీసుకునే నిర్ణయానికి తనతో పాటు జనసేన ఎమ్మెల్యేలు మద్దతిస్తారని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తొలిరోజు సభలో జగన్ ప్రవర్తన అసహ్యం కలిగించిందన్నారు

# ఈవీఎంలు బెంగళూరుకు తరలింపు

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 22-సార్వత్రిక ఎన్నికలకు కోసం వచ్చిన ఈవియంలలో ఫెయిల్యూర్ అయిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను సోమవారం రోజున బెంగళూరుకు తరలిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం టెక్కే మార్కెట్ యార్డ్ లో భద్రపరిచిన ఈవీఎం గోడౌన్ ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఫెయిల్యూర్ అయిన ఈవీఎంలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో భాగంగా బెంగళూరు బెల్ కంపెనీ నుండి వచ్చిన ఈవీఎంలలో ఫెయిల్యూర్ అయిన 435 ఈవీఎం లను బెంగళూరుకు తరలిస్తున్నట్లు ఆమె తెలిపారు. కమిషనింగ్ లో డిఫెక్ట్ వచ్చిన ఈవీఎంలు 194, మాక్ పోల్ డిఫెక్ట్ వచ్చిన ఈవీఎంలు 111, రిజర్వ్ లో ఉన్న ఈవీఎంలు 51, ఫస్ట్ లెవెల్ చెక్ లో పనిచేయని ఈవీఎంలు 78, ట్రైనింగ్లో డిఫెక్ట్ వచ్చిన ఒక ఈవియం వెరసి మొత్తం 435 ఈవీఎంలను స్కాన్ చేయడం పూర్తయిందని వీటన్నింటినీ బెల్ కంపెనీ, బెంగళూరుకు తరలిస్తున్నట్లు ఆమె తెలిపారు.

# పోస్టర్లు గుంజుకుని చించే హక్కు ఎవరిచ్చారు?..

## ఏపీ అసెంబ్లీ వద్ద పోలీసులపై వైసీపీ చీఫ్ జగన్ ఆగ్రహం





అమరావతి జులై22 ( విభారె ప్రతినిధి): ఏపీ అసెంబ్లీ వద్ద పోలీసుల తీరుపై వైసీపీ అధినేత జగన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసుల జులం ఎల్లకాలం సాగబోదని, ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. ఆంధ్రపద్రేశ్ అసెంబ్లీ సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలోలా అండ్ ఆర్డర్ వైఫల్యంపై అసెంబ్లీకి జగన్ నేతృత్వంలో వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల కండువాలతో అసెంబ్లీకి చేరుకున్నారు. సేవ్ డెమోక్రసీ నినాదాలు చేస్తూ ప్లకార్డులతో లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే గేటు వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. ప్లకార్డులు ప్రదర్శించొద్దంటూ వాగ్వాదానికి దిగారు. ప్లకార్డులను లాక్కుని చించేశారు. దీంతో పోలీసులపై జగన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటం ముఖ్యం. రాష్ట్రంలోఅరాచక పాలన సాగుతున్నది. పోలీసుల వైఖరి అత్యంత దారుణంగా ఉంది. పోస్టర్లు గుంజుకుని చించే హక్కు ఎవరిచ్చారు?. పోలీసులు ఉన్నది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం కోసం కాదు. పోలీసుల జులం ఎల్లకాలం సాగబోదు. ఈ విషయాన్ని పోలీసులు గుర్తుపెట్టుకోవాలంటూ హెచ్చరించారు. ఈ క్రమంలో అసెంబ్లీ గేటు వద్ద కాసేపు ఉద్రిక్తత నెలకొన్నది. అయితే జగన్ నిలదీత, సభ ప్రారంభం కావడంతో కాసేపటికే నల్లకండువాలతోనే వైసీపీ సభ్యులను పోలీసులు లోపలికి అనుమతించారు.

# ఏపీలో టీడీపీ దాడులపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన వై.ఎస్. జగన్



అమరావతి జులై22 ( విభారె ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ను కలిసి ఫిర్యాదు చేశారు. ఆదివారం సాయంత్రం వైసీపీ నాయకులతో కలిసి రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొనసాగుతున్న అరాచక పాలన, హత్యలు, దాడులు, విధ్వంసాలను జగన్ వివరించారు. వినుకొండలో వైసీపీ కార్యకర్త దారుణ హత్య, పుంగనూరులోఎంపీ మిథున్‌రెడ్డి పై రాళ్లతో దాడి , గత 45 రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక ఘటనలను వివనించారు. విధ్వంసాల ఆధారాలు, వీడియోలను గవర్నర్‌కు అందించారు.

# సంపాదకీయం

మంగళవారం 23-07-2024

## ప్రైవేట్ లో రిజర్వేషన్లు సాధ్యమేనా

భవిష్యత్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా ప్రైవేటు, కార్పొరేట్‌రంగంపైనే ఆధారపడి ఉంది. ప్రభుత్వరంగ సంస్థలు నష్టాల్లో కూరుకుపోవడం, ప్రైవేటురంగం వేగంగా విస్తరించడంతో ప్రభుత్వాలకు వచ్చే ఆదాయంలో కార్పొరేట్ పన్ను శాతమే ఎక్కువ. ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగాలు తగ్గిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు కూడా ఉపాధి కల్పన కోసం ప్రైవేటు సంస్థలను ప్రోత్సహిస్తున్నాయి. కంపెనీలు ఇచ్చే పన్నులతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. మరోవైపు ఎన్నికల్లో ప్రైవేటు సంస్థలు ఇచ్చే విరాళాలపై రాజకీయ పార్టీలు ఆధారపడుతున్నాయి. ఈ నేపథ్యంలో కార్పొరేట్ సంస్థల్లో స్థానిక రిజర్వేషన్ల అమలు సాధ్యమేనా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ప్రైవేటురంగంలోని పరిశ్రమల్లో స్థానికులకు రిజర్వేషన్లు కల్పించే అంశంపై దాదాపు దశాబ్దకాలంగా పోరాటాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గుతున్న నేపథ్యంలో స్థానిక ఉద్యోగాలు స్థానికులకే దక్కాలన్న నినాదంతో పలు సంస్థలు పోరాటాలు చేశాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇది ప్రత్యేక రాష్ట్ర పోరాటానికి కలిసి వచ్చింది. దీంతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రైవేట్ పరిశ్రమలలో స్థానికులకు రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుంది. దీనికి మంత్రిమండలి కూడా ఆమోదం తెలిపింది. స్థానికులకు ఉపాధి కల్పించే పరిశ్రమలకు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించింది. తర్వాత 2023లో హరియాణా ప్రభుత్వం కూడా ప్రైవేటు పరిశ్రమల్లో స్థానికులకు రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు ఆమోదం తెలిపింది. తర్వాత కోర్టు రద్దు చేసింది. తాజాగా కర్ణాటక కూడా ప్రైవేటు రిజర్వేషన్ల బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనిపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో సిద్ధరామయ్య సర్కార్ నిర్ణయం వాయిదా వేసింది.గతంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రైవేటులో స్థానికులకే రిజర్వేషన్లు కల్పించే ప్రయోగాలు చేశాయి. కానీ ఆశించిన ఫలితాలు పొందలేకపోయాయి. ప్రైవేట్ రంగంలోని పరిశ్రమలలో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీ ఎంప్లాయిమెంట్ ఆఫ్ లోకల్ క్యాండిడేట్స్ ఇన్ ఇండస్ట్రియల్/ ఫ్యాక్టరీస్ యాక్ట్ 2019 పేరుతో చట్టాన్ని కూడా తీసుకొచ్చింది. అయితే ఈ చట్టాన్ని హైకోర్టులో సవాలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం మాత్రమే సామరస్యపూర్వక వాతావరణంలో ఎటువంటి ఒతిళ్లు లేకుండా ప్రైవేట్ రంగంలో స్థానిక రిజర్వేషన్లు అమలు చేస్తామంటోంది. తర్వాత పెట్టుబడులను ఆకర్షించడానికి ఎటువంటి ప్రతిబంధకాలుండవని భావిస్తోంది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలో అమలు చేసిన స్థానిక రిజర్వేషన్లను అక్కడి పరిశ్రమలు పెద్దగా పరిగణనలోకి తీసుకోలేదు. ప్రభుత్వాలు ఇస్తానన్న రాయితీలపై కూడా ఆసక్తి చూపలేదు.ప్రైవేట్ కంపెనీల లక్ష్యం లాభార్జనే. అందుకు కంపెనీలకు సమర్థమైన నైపుణ్యం ఉన్న మానవ వనరులు అవసరం. కంపెనీలు నైపుణ్యం, శిక్షణ ఉన్నవారినే ఎంపిక చేసుకుంటాయి. ప్రభుత్వాలు ఇచ్చే రాయితీల కోసం తమ లాభార్జన లక్ష్యాన్ని పణంగా పెట్టవు. నైపుణ్యం లేని స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వవు. ఇది ఇప్పటికే పలు రాష్ట్రాల్లో నిరూపితమైంది. ఉద్యోగుల సామర్థ్యాన్ని సెల్ఫ్ అప్రైజల్, సూపర్వైజరీ నివేదికల ద్వారా కంపెనీలు నిరంతరం పరీక్షిస్తుంటాయి. కంపెనీలో పనిచేసే ఒక ఉద్యోగి లేదా ఒక టీం లాభాలకు ఎంత వరకు ఉపయోగపడతారని మాత్రమే యాజమాన్యాలు ఆలోచిస్తాయి. ఈ విషయంలో ఏమాత్రం వెనుకబడినా.. పొపాటు చేసినా.. పనితీరు అంచనాల మేరకు లేకపోయినా నిర్దాక్షిణ్యంగా ఉద్యోగం నుంచి తొలగిస్తాయి.ఇక ప్రభుత్వాలు స్థానిక రిజర్వేషన్లు అమలు చేయడం వలన పెట్టుబడులపై ప్రభావం ఉంటుందని పారిశ్రామిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కంపెనీలకు సమర్థులైన, సంబంధిత సాంకేతికతలో అనుభవం, నైపుణ్యం ఉన్న ఉద్యోగులు అవసరమవుతారని, స్థానిక రిజర్వేషన్ కారణంగా అలాంటి అవకాశాలు దూరమవుతాయని పేర్కొంటున్నాయి. తద్వారా ఆర్థికంగా నష్టం జరుగుతుంది. ఈ నేపథ్యంలో స్థానిక కోటా గురించి ఆలోచించవు. స్థానిక రిజర్వేషన్ల విధానం తమ లక్ష్య సాధనకు, అభివృద్ధికి ఆటంకమని కంపెనీలు భావిస్తాయి. ఈ విధానం అమలు చేసే యంత్రాంగం పని మరింత క్లిష్టతరమవుతుంది. దీంతో పెట్టుబడులు వెనక్కువెళ్లే అవకాశం ఉంటుంది.స్థానిక రిజర్వేషన్ల కారణంగా ప్రాంతీయ విద్వేషాలు తలెత్తే అవకాశం ఉంది. మహారాష్ట్రలో అమల చేసిన రిజర్వేషన్ల కారణంగా ముంబైలో లోకల్స్, నాన్ లోకల్స్ మధ్య హింసకు కారణమయ్యాయి. స్థానిక రిజర్వేషన్ల కారణంగా ఉప ప్రాంతీయ విద్వేషాలు కూడా రగిలే అవకాశం ఉంటుంది. స్థానిక రిజర్వేషన్లలో రాష్ట్రమంతా ఒకే జోన్‌గా ఉంటుంది. ఆయా ప్రాంతాలలో ఉన్న పరిశ్రమలలో ఉన్న ఉద్యోగాలు ఆ ప్రాంతవాసులకే ఇవ్వాలని డిమాండ్ రావచ్చు. దీంతో ఇప్పటి వరకు అమలు చేసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్ హరియాణా రాస్ట్రాల్లో ప్రైవేట్ రంగంలో స్థానిక రిజర్వేషన్లు కాగితాల మీదే మిగిలిపోయాయి.గతేడాది హరియాణాలోని మనోహర్‌లాల్ ఖట్టర్ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ప్రైవేటు సంస్థల్లో 75 శాతం రిజర్వేషన్లను పంజాబ్?హరియాణా హైకోర్టు కొట్టివేసింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. హరియాణాలోని ప్రయివేటు సంస్థల్లో నెల జీతం రూ. 30 వేల కన్నా తక్కువగా ఉన్న ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం హరియాణా స్టేల్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫ్ లోకల్ క్యాండిడేట్స్ చట్టం చేసింది. స్థానికత సర్టిఫికెట్‌గానీ, స్థానిక నివాసం సర్టిఫికెట్‌నుగానీ సమర్పిస్తేనే ఉద్యోగాలకు పరిశీలించాలని నిబంధన విధించింది. దీనిపై ప్రైవేటు కంపెనీల యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన కోర్టు ప్రయివేటు సంస్థల్లో స్థానిక రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని అభిప్రాయపడింది. ప్రైవేటు రిజర్వేషన్ చట్టాని కొట్టేసింది.

# అయ్యా సీఎంగారు...

హైదరాబాద్, జూలై 22, (న్యూస్ పల్స్) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తను ఇచ్చిన రెండు దరఖాస్తులపై ఎలాంటి స్పందన లేదని మాజీ డీఎస్పీ నళిని ఆవేదన వ్యక్తం చేశారు. నెలలోనే పూర్తి అవుతుందని భావించాను కానీ? 7 నెలలు దాటిపోయిందంటూ తాజాగా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.నళిని? తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ఈ పేరు చుట్టూ తెగ చర్చ జరిగింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో.. తన డీఎస్పీ పదవికి రాజీనామా చేసి వార్తల్లోకి ఎక్కారు ఈమె. ఆ తర్వాత రాష్ట్ర సాధన కోసం క్రియాశీలకంగా పోరాడారు. ఉద్యమ వాణిని వినిపించేందుకు పరకాల బైపోల్ బరిలోనూ నిలబడ్డారు. ఉద్యమ సమయంలో ఎంతో పేరు సంపాదించికున్న నళిని? ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత ఆమె ప్రస్తావన పెద్దగా లేకుండా పోయింది. పదేళ్లలో కూడా పెద్దగా కనిపించిన దాఖలు లేవు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి పోలీస్ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా? నళిని ప్రస్తావన తీసుకొచ్చారు. తిరిగి డీఎస్పీ ఉద్యోగం ఎందుకు ఇవ్వకూడదనే అంశంపై ఆరా తీశారు. పోలీసు ఉద్యోగం కుదరకపోతే? అదే స్థాయిలో ఉండే మంచి ఉద్యోగాన్ని ఇవ్వాలని పోలీసులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ విషయంలో నళినితో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇవ్వటంతో..

### ఏడు నెలలైనా... ఇంతేనా...

మళ్లీ మాజీ డీఎస్పీ నళిని ఉద్యోగ అంశం తెరపైకి వచ్చింది. ఇదే సమయంలో ఆమె స్వయంగా వెళ్లి డిసెంబర్ 30వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసింది. అధ్యాత్మిక ప్రచారానికి సాకారం (వేద విద్యా కేంద్రం)అందించటంతో పాటు తన సర్వీస్ అంశానికి సంబంధించి లేఖలను ఇచ్చినట్లు తెలిసింది.అయితే తాజాగా మాజీ డీఎస్పీ నళిని ఫేస్ బుక్ లో పోస్ట్ చేశారు. సీఎం కలిసిన ఒక్క నెలలోనే తన పిటిషన్ పై ఎంక్వైరీ పూర్తి చేస్తారని భావించానని?. కానీ 7 నెలలు పూర్తి కావొస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు తన రెండు దరఖాస్తులు బల్ల మీదనే ఉన్నాయా?? లేక చేత బుట్టలోకి పోయాయా..? అంటూ తన అనుమానాన్ని వ్యక్తం చేసింది."సిఎం సార్ కొలువుకు ఎక్కగానే నన్ను మీద మీద యాది చేసిండు .ఇప్పుడేమో సప్పుడే చేస్తలేడు. మధ్యల తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు కూడా జరిగినాయి.ఆశ్చర్యంగా నా ఊసే ఎత్తలేదు.ఇంతకీ నా రెండు దరఖాస్తులు బల్ల మీదనే ఉన్నయో లేక చెత్త బుట్టలోకి పోయినవోనని డౌట్ వస్తుంది. ఇప్పుడే చీఫ్ ఇతీనీ ను నీబట బతితీ ని కదిలించా?! చిట్టి రాసిన. మా చిన్నప్పుడు ఆడుక్కొనేటోడు ఇంటి ముందుకు వస్తె ,ఇంట్లో చల్లన్నం లేకపోతే పైకి వెళ్లవయ్య అని మెల్లగా చెప్పేటోల్లం. కనీసం ఆ పాటి మర్యాద అయినా నాకు ఇస్తారేమో చూడాలి.అందుకే నేను ఇన్నేళ్ళు ఎవ్వరినీ కలవాలే.ఉద్యమం చేసేటప్పుడే నాకు చాలా విషయాలు అర్థం అయినవి""ఒక నెలలోనే నా పిటిషన్ పై ఎంక్వైరీ పూర్తిచేస్తారు అనుకున్నా. 7 నెలలు కావొస్తోంది.అందుకే రిమైండర్ లెటర్,పోస్ట్ రాయాల్సి వచ్చింది. సెక్రటేరియట్ చూట్టూ తిరిగేంత సమయం మరియు ఓపిక నా వద్ద లేవు అని నేను ఆ రోజే రేవంతన్నకు చెప్పినా?!" అని నళిని తన పోస్టులో రాసుకొచ్చారు.తాజాగా నళిని చేసిన పోస్టులో ప్రభుత్వానికి రాసిన లేఖను కూడా పోస్ట్ చేసింది. డిసెంబర్ 30, 2023వ తేదీన ముఖ్యమంత్రికి రెండు పిటిషన్లు ఇచ్చానని గుర్తు చేశారు. అయితే నళిని చేసిన తాజా లేఖపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది?.

# నా అప్లికేషన్లు చెత్తబుత్తలో వేశారా..

### మాజీ డీఎస్పీ నళిని ఆవేదన

హైదరాబాద్ జూలై 22 (న్యూస్ పల్స్),తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సడెన్‌గా ఒక మాజీ పోలీస్ అధికారి పేరు తెరపైకి వచ్చింది. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఆ ఉద్యోగిని బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మర్చిపోవడంతో పాటు.. ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. ఆమె ఆచూకీ తెలుసుకుని..సీఎంను కలవాలంటూ మాజీ డీఎస్పీ నళినికి కబురు పంపారు. నేరుగా సీఎం పిలవడంతో ఆమె రేవంత్‌రెడ్డిని కలిశారు. నళినికి పోలీస్ శాఖలో గతంలో ఆమె పనిచేసిన హోదాకు తగ్గకుండా ఉద్యోగం ఇచ్చేందుకు ప్రతిపాదించగా. నళిని తిరస్కరించారు. ప్రస్తుతం ఆమె అధ్యాత్మిక మార్గంలో ఉన్నానని, ఉద్యోగం చేసుందుకు తాను సిద్ధంగా లేనని స్పష్టం చేశారు. పోలీస్ ఉద్యోగానికి అవసరమైన ఫిట్‌నెస్‌తో తాను లేనని చెబుతూ. ప్రభుత్వం సహాయం చేయాలనుకుంటే వేద విద్య ప్రచారం కోసం సహాయం చేయాలని అడిగారు. దీనికి సంబంధించి రెండు వినతిపత్రాలను సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు. నళిని సీఎం రేవంత్ రెడ్డిని కలిసి దాదాపు 7 నెలలు అవుతున్నా. ఆమె చేసిన వినతులపై ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో ఆమె మరోసారి ప్రభుత్వానికి లేఖ రాశారు. కొంచెం ఘాటైన పదాలను ఉపయోగిస్తూ ఆమె లేఖ రాయడం తీవ్ర చర్చనీయాంశమవుతోంది.నళిని రాసిన లేఖ ఇదే.ప్రభుత్వానికి తాను అందించిన వినతిపత్రాలపై సానుకూల స్పందన రాకపోవడంతో సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్‌లో ఆమె ఒక పోస్టు పెట్టారు. తనను పీఆర్ స్టంట్ కోసం వాడుకొని వదిలేశారని మాజీ పోలీస్ అధికారి నళిని ఆవేదన వ్యక్తం చేశారు. యాచకులకు ఇచ్చిన విలువ కూడా తనకు రేవంత్ ప్రభుత్వంలో ఇవ్వడంలేదన్నారు. రేవంత్ రెడ్డి సీఎం కొలువుకు ఎక్కగానే తనకు ఎక్కువ ప్రచారం కల్పించారని. ఇప్పుడేమో చప్పుడే చేస్తలేదని నళిని పోస్టులో పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు జరిగిన సందర్భంలోనూ నా వూసే ఎత్తకపోవడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. ఇంతకీ తన రెండు దరఖాస్తులు బల్ల మీదనే ఉన్నయో లేక చెత్త బుట్టలోకి పోయినవో అనే అనుమానం కలుగుతుందన్నారు. సీఆర్వో, ఓఎస్డీకి ఓ లేఖ రాశానంటూ ఆమె ఫేన్‌బుక్ పోస్టులో పేర్కొన్నారు.తీవ్ర ఆవేదన..చిన్నప్పుడు అడుక్కుంటూ ఎవరైనా ఇంటి ముందుకు వస్తే. ఇంట్లో చల్లన్నం లేకపోతే పైకి వెల్లవయ్య అని మెల్లగా చెప్పేవాళ్లమని. కనీసం అలాంటి మర్యాద అయినా తనకు ఇస్తారేమో చూడాలని పేర్కొన్నారు. తాను చాలా ఏళ్లుగా ఎవ్వరినీ కలవలేని. ఉద్యమం చేసేటప్పుడే తనకు చాలా విషయాలు అర్థం అయ్యాయని చెప్పారు. ఒక నెలలో తన పిటిషన్‌పై విచారణ పూర్తి చేస్తారని భావించానని. ఏడు నెలలు పూర్తైనా ఎటువంటి స్పందన లేకపోవడంతో. రిమైండ్ లెటర్ రాయాల్సి వచ్చిందని నళిని తెలిపారు. సచివాలయం చుట్టూ తిరిగేంత సమయం, ఓపిక తన వద్ద లేవనే విషయాన్ని రేవంత్ రెడ్డిని కలినప్పుడే చెప్పానని నళిని తెలిపారు.


# బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక : ఎమ్మెల్యే తలసాని



హైదరాబాద్ : ఆషాడ బోనాల ఉత్సవాలు( తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తాయని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెల రోజులపాటు నిర్వహించే ఈ బోనాల ఉత్సవాలకు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున తరలివస్తారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.నాటి నుంచి బోనాల ఉత్సవాలకు వచ్చే లక్షలాది మంది భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తూ అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆదివారం సికింద్రాబాద్ బోనాలు, మహంకాళి అమ్మవారి జాతరను ప్రశాంతంగా, ఘనంగా నిర్వహించడం పట్ల అధికారులు, మీడియా ప్రతినిధులను అభినందించారు.

# అమెరికాలో కాల్పుల కలకలం ముగ్గురు మృతి

న్యూయార్క్: అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం సృష్టిస్తున్నాయి. మిసిసిపీ ప్రాంతం ఇండియానాలో చర్చి స్ట్రీట్‌లో ఓ నైట్ క్లబ్‌పై దుండగుడు కాల్పులు జరపడంతో ముగ్గురు వ్యక్తులు మృతి చెందగా 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇండియానాలో భారత సంతతి వ్యక్తిపై డ్రైవర్ కాల్పులు జరిపాడు. కారు ఢీకొన్న విషయం ఇద్దరు మధ్య గొడవ జరగడంతో డ్రైవర్ తుపాకీ తీసుకొని భారత సంతతి వ్యక్తి మెడపై కాల్పులు జరిపాడు. సదరు వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై కాల్పులు జరిపిన విషయం తెలిసిందే.




# కర్ణాటక మంత్రి అల్లుడి కోసం.. అసెంబ్లీలో మరో కార్యదర్శి కొలువు



బెంగళూరు: కర్ణాటక మంత్రి అల్లుడి కోసం ఆ రాష్ట్ర అసెంబ్లీలో కొత్తగా మరో కార్యదర్శి కొలువును సృష్టిస్తున్నారు. విధానసభ అసెంబ్లీ కార్యదర్శి పదవి ఇప్పటికే ఉండగా 'సెక్రటరీ 2' అనే కొత్త ఉద్యోగం కోసం స్పీకర్ కసరత్తు చేస్తున్నారు. దీనికి సంబంధించిన లేఖను అసెంబ్లీ ఆర్థిక శాఖకు స్పీకర్ పంపి ఆమోదం కోరారు. ఆహారం, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల మంత్రి కేహెచ్ మునియప్ప అల్లుడు శశిధర్ జేఈ కోసం అసెంబ్లీలో రెండో కార్యదర్శి పదవిని సృష్టిస్తున్నట్లు తెలుస్తున్నది.కాగా, కర్ణాటక విధానసభ అసెంబ్లీ ఎంప్లాయిస్ అసోసియేషన్ దీనిపై నిరసన వ్యక్తం చేసింది. మంత్రి కేహెచ్ మునియప్ప అల్లుడు శశిధర్‌కు స్థానం కల్పించేందుకు 'సెక్రటరీ 2' పేరుతో కొత్త పోస్టు సృష్టిస్తున్నారని ఆరోపించింది. కార్యదర్శి పదవిని శశిధర్ తీసుకోలేనందున కొత్త ఉద్యోగం కల్పిస్తున్నారని విమర్శించింది.మరోవైపు ఎమ్మెల్యే ఎం రూపకళ భర్త అయిన శశిధర్ ప్రస్తుతం కంప్యూటర్ వింగ్‌లో ఉన్నారని అసెంబ్లీ ఉద్యోగుల సంఘం తెలిపింది. సాధారణంగా పదోన్నతి ద్వారా సెక్రటరీ పోస్టు పొందుతారని పేర్కొంది. కంప్యూటర్ వింగ్ ఉద్యోగులు ఎప్పుడూ కార్యదర్శులు కాలేరని విమర్శించింది. విధానసభ అసెంబ్లీ కార్యదర్శికి ఈ మేరకు లేఖ రాసింది.కాగా, కర్ణాటక అసెంబ్లీ రూల్ బుక్ ప్రకారం ఆ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శికి ఉన్న అధికారాలు, హోదా వంటివి శాసనసభ కార్యదర్శికి కూడా ఉంటాయి. ఈ నేపథ్యంలో కేహెచ్ మునియప్ప అల్లుడు శశిధర్ కోసం అసెంబ్లీలో కొత్తగా 'సెక్రటరీ 2' కొలువు సృష్టించడంపై ఆ రాష్ట్ర బీజేపీ మండిపడింది. ఎమ్మెల్యేల తిరుగుబాటును అణిచివేసేందుకు రాజ్యాంగాన్ని ఉల్లంఘించి 90 కేబినెట్ గ్రేడ్ హోదాలను సీఎం సిద్ధరామయ్య ప్రభుత్వం ఇప్పటికే సృష్టించిందని అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ఆర్ అశోకా ఆరోపించారు. తాజాగా మంత్రి అల్లుడికి కొత్త పదవి కల్పిస్తున్నారని ఎక్స్ పోస్ట్‌లో విమర్శించారు.

# నిరసన తెలుపుతున్న మహిళా రైతులపై ట్రక్కు మట్టి పోసి...

భోపాల్: తన భూమిలో రోడ్డు వేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టిన ఇద్దరు మహిళపై ట్రక్కు మట్టి లోడ్‌ను పోశారు. దీంతో సదరు మహిళలు మట్టిలో కూరుకుపోయిన సంఘటన మధ్య ప్రదేశ్‌లోని రేవా జిల్లా మంగావా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం? హినోత్ జోరాట్ గ్రామంలో మమతా పాండే, ఆశా పాండే మహిళలు వ్యవసాయ భూమిని లీజుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. వాళ్లు పంటలు పండించే భూమిలో నుంచి రోడ్డు చేపడుతామని చెప్పడంతో సదరు మహిళలు వ్యతిరేకించారు. వారు లీజు తీసుకున్న భూమిలో మట్టి పోసేందుకు ట్రక్కు రావడంతో మమతా, ఆశాలకు అడ్డుకున్నారు. అక్కడ నిలబడి నిరసన తెలుపుతున్న మహిళలపై ట్రక్కు డ్రైవర్ మట్టిపోయడంతో మట్టిలో కూరుకుపోయారు.తల మాత్రమే బయటకు కనిపించగా దేహం మొత్తం మట్టిలో కూరుకుపోయింది. స్థానికులు వెంటనే స్పందించి వారిని మట్టిలో నుంచి బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు ఆరోగ్య పరిస్థితి సాధారణంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. దీనికి సంబంధించిన వీడియోను భోపాల్



కాంగ్రెస్ తన ట్విట్టర్‌లో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది. మహిళా రైతులతో ప్రవర్తించే పద్ధతి ఇదేనా అని నెటిజన్లు మండిపడుతున్నారు. మహిళా రైతులకు జరుగుతున్న నష్టాన్ని ఇచ్చిన తరువాత రోడ్డు పనులు చేపడితే బాగుండేదని నెటిజన్లు వాపోతున్నారు. ఇలాంటి దుశ్చర్యాలకు పాల్పడడం సరికాదని మండిపడుతున్నారు. వారిపై మట్టి పోసి ట్రక్కు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్టు సమాచారం.

# స్పా సెంటర్లలో యవ్వారం

ఒంగోలు, జూలై 22 బయటేమో స్పా, మస్సాజ్ సెంటర్ల బోర్డులు.. లోపలేమో యవ్వారం వేరే.. తనిఖీలకు వెళ్లిన పోలీసులు బిత్తరపోయారు.. ప్రకాశం జిల్లా ఎస్పిగా నాలుగురోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన దామోదర్ అసాంఘిక కార్యక్రమాలపై తనదైన స్టైల్లో దృష్టి పెట్టారు.. ఒంగోలులో మసాజ్ సెంటర్లపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. దీంతో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి.. ఒంగోలు నగరంలో మసాజ్ సెంటర్లు, స్పా క్లినిక్‌ల పేరుతో యువతులతో యువకులకు క్రాస్ జెండర్ మసాజ్‌లు చేస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి.. దీంతో మొత్తం 16 స్పా సెంటర్లపై ఏకకాలంలో దాడులు చేయాలని ఎస్పి దామోదర్ పోలీసు సిబ్బందిని అదేశించారు. ఎస్పి ఆదేశాల మేరకు బృందాలుగా విడిపోయిన పోలీసులు నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో నడుపుతున్న స్పా సెంటర్లపై ఏకకాలంలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో పలు స్పా సెంటర్లలో యువకులకు యువతులు మసాజ్ చేస్తున్నట్టు గుర్తించారు. పలు సెంటర్లలో యువతీయువకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు.మరోవైపు స్పా సెంటర్ల పేరుతో క్రాస్ జెండర్ మసాజ్ చేస్తున్న కొన్ని పార్లర్లలో యువకులను ఆకర్షించేందుకు రూంలలో ఆధునాతమైన లైటింగ్‌లు, ఏసీలు ఏర్పాటు చేయడాన్ని చూసిన పోలీసులు బిత్తరపోయారు. అంతే కాకుండా మసాజ్ కోసం వచ్చే యువకులతో బేరసారాలు లేకుండా నేరుగా తెలుసుకునేందుకు ధరల పట్టిక కూడా ఏర్పాటు చేశారు. రెండు నెలలకు ఒక ప్యాకేజీ, మూడు, నాలుగు నెలలకు డిస్కౌంట్‌తో కూడిన ఆఫర్లు కూడా ఇస్తున్నట్లు గుర్తించారు. కొన్నేళ్లుగా ఒంగోలులో గుట్టుగా సాగుతున్న ఈ క్రాస్ జెండర్ మసాజ్ సెంటర్లపై స్థానికులు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోని పోలీసులు.. కొత్త ఎస్పి ఆదేశాలతో వెంటనే రంగంలోకి దిగి దాడులు చేయడం కలకలం రేపింది. స్పా సెంటర్ల పేరుతో క్రాస్ జెండర్లతో మసాజ్ చేస్తున్న వారిపై కేసులు పెట్టడం కంటే వారికి అవగాహన కల్పించి ముందు కౌన్సిలింగ్ చేయనున్నట్టు ఎస్పి దామోదర్ తెలిపారు.

# హత్యలకు రాజకీయ రంగులు

గుంటూరు, జూలై 22, వినుకొండలో రషీద్ హత్య రాజకీయ కోణంలో జరిగిందా? లేకుంటే వ్యక్తిగత కక్షలా? నడిరోడ్డుపై జరిగిన ఈ హత్య రాజకీయరంగు పులుముకుంది. హతుడు వైసీపీ వ్యక్తి అని.. చంపింది టిడిపి కార్యకర్త అని.. దీని వెనుక రాజకీయ ప్రోద్భలం ఉందని వైసీపీ ఆరోపిస్తోంది. రాష్ట్రపతికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడుతోంది. మరోవైపు టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన నెలన్నర కాలంలో దారుణ ఘటనలు చోటు చేసుకున్నాయని జగన్ ఆందోళన వ్యక్తం చేశారు.సోషల్ మీడియా ద్వారా ప్రధాని మోదీతో పాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఘటన పూర్తిగా రాజకీయ రంగు పులుముకుంది. అయితే పోలీసులు మాత్రం ఇందులో రాజకీయ కోణం కనిపించడం లేదని చెబుతున్నారు. స్వయంగా జిల్లా ఎస్పీ ఒక ప్రకటన చేశారు.వాస్తవానికి హతుడు షేక్ రషీద్,నిందితుడు షేక్ జిలాని ఏడాది కిందటి వరకు వైసీపీలోనే తిరిగారు.వారి మధ్య వివాదాలతో విడిపోయినట్లు తెలుస్తోంది.2022 మొహర్రం రోజు మద్యం తాగిన క్రమంలో ఓ రెండు వర్గాలు సీసాలతో దాడి చేసుకున్నాయి.జిలాని బీరు సీసాతో ఒక వ్యక్తిని పొడవడంతో అతని తల,గొంతు పై గాయాలయ్యాయి.దాని తర్వాత కొందరి ప్రోద్భలంతో జిలాని ఇంటిపై రషీద్ దాడికి పాల్పడ్డాడు.జిలాని సోదరుడు జానీ, కుటుంబ సభ్యులను కొట్టి అక్కడే ఉన్న బుల్లెట్ బండిని తగులు పెట్టాడు. దీనిపై జిలాని ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోలేదు. కానీ అంతకంటే ముందు బీరు సీసా తో పొడిచాడని జిలానిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. జైలుకు పంపించారు. దీంతో రషీద్ పై జిలాని కక్ష పెంచుకున్నాడు. అప్పటినుంచి ఇద్దరి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి.ఎన్నికల సమయంలో ముస్లిం నాయకుల మధ్య ఘర్షణ జరిగింది.ఈ కేసుల్లో జిలాని పేరును చేర్చారు.దీని వెనుక రషీద్ ఉన్నాడని జిలాని అనుమానించాడు.ఎలాగైనా మట్టు పెట్టాలని నిర్ణయం తీసుకున్నాడు.బుధవారం రాత్రి వినుకొండలో మద్యం దుకాణం నుంచి రషీద్ బయటకు రాగానే కొబ్బరి బొండాల కత్తితో దారుణంగా నరికి చంపాడు.ఇద్దరూ వైసీపీలోనే కొనసాగే వారని.. వైసీపీలో కొనసాగుతున్న రౌడీషీటర్ వద్ద అనుచరులుగా ఉండేవారని స్థానికులు చెబుతున్నారు. రషీద్ ది వైసీపీ అని.. చంపిన జిలాని మాత్రం టిడిపి కార్యకర్త అని వైసిపి ఆరోపిస్తోంది. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వైసిపి అధినేత జగన్ వినుకొండ ఈరోజు వస్తున్నారు. ఇప్పటికే ఇది రాజకీయ కోణంతో జరిగింది కాదని పోలీసులు ప్రకటించారు. కానీ వైసీపీ నేతలు మాత్రం ఇది ముమ్మాటికీ రాజకీయ ప్రాద్భలంతో జరిగిన హత్యగా చెబుతున్నారు.మరోవైపు రెండు పార్టీల మధ్య ఫోటోల వార్ నడుస్తోంది. నారా లోకేష్ జన్మదిన వేడుకల్లో నిందితుడు జిలాని పాల్గొన్నారు అని.. టిడిపి కండువా వేసుకొని ప్రచార వాహనంపై జిలాని దిగిన ఫోటోలను వైసిపి ప్రచారం చేస్తోంది.అదే సమయంలో టిడిపి మరికొన్ని ఫోటోలను బయటికి తీసింది.వైసీపీ నేతలతో నిందితుడు జిలాని ఉన్న ఫోటోలను బయటపెట్టింది.దీంతో ఇది రాజకీయ అంశం గా మారిపోయింది.ఈరోజు జగన్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించనున్నారు.అయితే ఇప్పటికే పోలీసులు వినుకొండలో 144 సెక్షన్ ప్రకటించారు.ప్రస్తుతానికి అమలులో ఉంది.దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.ఈ ఘటనతో రాజకీయంగా యాక్టివ్ కావాలని వైసిపి భావిస్తోంది.రాష్ట్రస్థాయిలో ఉద్యమించాలని నిర్ణయం తీసుకుంది.దీనిపై కార్యాచరణ ప్రారంభించింది.

# ఏజెన్సీలో పొంగుతున్న కొండ వాగులు

రంపచోడవరం,ఏజెన్సీ వ్యాప్తంగా గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొండవాగులు పొంగిపొర్లుతున్నాయి. దేవీపట్నం మండలం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండి పోచమ్మ అమ్మవారి ఆలయం గోదావరి పూర్తిగా మునిగింది. గోదావరి వరద ఉధృతి అధికంగా ఉండడంతో పాపికొండలు టూరిజం బోట్లను నిలిపివేసారు. రంపచోడవరం మండలం భూపతిపాలెం ప్రాజెక్టు నుండి ఐదు గేట్లను ఎత్తి 2000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసారు ఇరిగేషన్ అధికారులు.రంపచోడవరం మండలం పందిరి మామిడి బందపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జిపై నుండి వరద నీరు ప్రవహిస్తోంది. రంపచోడవరం మండలం ముసురుమిల్లి ప్రాజెక్టుకు హెడ్ వర్క్ పూర్తి కాకపోవడంతో వరద నీరు వృధాగా పోతుంది. రాజవొమ్మంగి మండలంలో నెల్లిమెట్ల, లబ్బర్తి, ఒట్టిగడ్డ, ఎర్రంపాడు, లబ్బర్తి, అనంతగిరి గ్రామాల మధ్య రోడ్లపై వాగులు పొంగి పడడంతో సుమారు 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దేవీపట్నం మండలం ఫజుల్లాబాద్ గ్రామ సమీపంలోని రహదారిపై వరద నీరు ప్రవహిస్తోంది.మారేడుమిల్లి మండలం బొడ్లంక గ్రామసమీపంలో ఉన్న పెల్లిరేవు కొండవాగు ఉధృతంగా ప్రవహించడంతో సుమారు 70 గ్రామాలు జలదిగ్భందం అయ్యాయి.

# ఓవర్ టూ ఢిల్లీ

### హస్తినకు ఏపీ పొలిటిక్స్

విజయవాడ, జూలై 22 ఆంధ్రప్రదేశ్ రాజకీయం దేశ రాజధాని ఢిల్లీకి చేరుతోంది. కేంద్రం నుంచి భారీగా నిధులు రాబట్టేందుకు కొత్త ఫార్ములాతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుకెళ్తున్నారు. దీనిపై తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎంపీలకు దిశా నిర్దేశం చేశారు. ఇక ఏపీలో వైసీపీ లీడర్లు, కేడర్‌పై జరుగుతున్న దాడులను పార్లమెంటులో ఎండగట్టేందుకు పార్టీ ఎంపీలతో వైఎస్ జగన్ వ్యూహం సిద్ధం చేశారు.ఏపీలో అధికార ఎన్డీయే కూటమి, విపక్ష వైసీపీల మధ్య పీక్స్‌కు చేరిన పొలిటికల్ ఫైట్‌లో ఢిల్లీ ట్విస్ట్ ఆసక్తికరంగా మారింది. పార్లమెంటు సమావేశాల కోసం టీడీపీ, వైసీపీ వ్యూహ ప్రతి వ్యూహాలు పన్నుతున్నాయి. పార్లమెంటు సమావేశాల్లో ఎలాంటి వ్యూహం అనుసరించాలో టీడీపీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు ఏపీ సీఎం చంద్రబాబు.మరోవైపు పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై వైసీపీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు వైఎస్ జగన్. తాడేపల్లి నివాసంలో ఎంపీలతో సమావేశమైన జగన్? ఢిల్లీలో తాను చేయబోయే ధర్నాపై చర్చించారు. రాష్ట్రంలో జరుగుతోన్న దాడులు, హత్యలను ఢిల్లీ వేదికగా కేంద్రం, దేశం దృష్టి తీసుకెళ్లాలన్నారు జగన్. దీనిపై పార్లమెంటులో వైసీపీ గళం వినిపించాలన్నారు. ఉభయ సభల్లో ఏవిధంగా వ్యవహరించాలో ఎంపీలకు సూచించారు. వైసీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులను దేశవ్యాప్తంగా తెలియజేయాలని జగన్ సూచించారు. రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర హోంమంత్రికి ఫిర్యాదు చేయాలని వైసీపీ ఎంపీలు నిర్ణయించారు.అటు దేశ రాజధానిలో జగన్ ధర్నా, ఇటు పార్లమెంటులో టీడీపీ, వైసీపీ ఫైట్‌కి రంగం సిద్ధమైంది. దీంతో ఢిల్లీ పొలిటికల్ స్క్రీన్‌పై ఏపీ పొలిటికల్ సినిమా రచ్చకు కౌంట్‌డౌన్ షురూ అయింది.పార్లమెంట్ లో అనుసరించాల్సిన వ్యూహంపై చంద్రబాబు నివాసంలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరగింది. ఏపీకి రావాల్సిన పెండింగ్ ప్రాజెక్టులపై చంద్రబాబు ఎంపీలకు వివరించారు. వివిధ శాఖలకు చెందిన సమాచారాన్ని తీసుకుని కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని ఎంపీలకు చంద్రబాబు సూచించారు. అవసరాన్ని బట్టి రాష్ట్ర మంత్రులను వెంట పెట్టుకుని ఆయా శాఖలకు చెందిన కేంద్ర మంత్రులను కలవాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రంలోని వివిధ మంత్రిత్వ శాఖల నుంచి తెచ్చుకోవలసిన నిధులు, వివిధ కేంద్ర పథకాల ద్వారా రాష్ట్రానికి మరింత ప్రయోజనం పొందేందుకు చేయాల్సిన కృషిపై ఎంపీలకు చంద్రబాబు ప్రత్యేకమైన సూచనలు చేశారు. అమరావతి, పోలవరం వంటి ప్రాజెక్టులకు కేంద్ర సాయంపై ఎక్కువ దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం కోసం ఒక్కో ఎంపీకి ఇప్పటికే కొన్ని శాఖలు చొప్పున బాధ్యతలు అప్పగించారు.ఆ ఎంపీలు తరచూ ఆయా కేంద్ర మంత్రుల్ని కలిసి రాష్ట్ర ప్రాజెక్టులను ఫాలో అప్ చేయాలన్నారు. కేంద్ర ప్రాయోజిత పతకాలకు ఎక్కువగా నిధులు వచ్చే అవకాశం ఉందని వాటి విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో వివిధ ప్రాజెక్టులకు భూముల కేటాయింపునకు సంబంధించిన పెండింగ్ అంశాలతో పాటు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను మళ్లీ గాడిన పెట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపైనా దిశానిర్దేశం చేశారు. విభజన హామీల్లో భాగంగా రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ సంస్థలకు అవసరమైన పూర్తి సదుపాయాలు కల్పించడంపైనా అధికారులవద్ద నుంచి సమాచారం తీసుకుని సభ్యులకు ఇచ్చారు. కేంద్ర సంస్థలకు భూములు కావాలంటే.. వేగంగా ఇస్తామని చెప్పాలన్నారు. జగన్ ఢిల్లీలో చేస్తానని చెప్పిన ధర్నాను పట్టించుకోవాల్సిన అవసరం లేదని చంద్రబాబు ఎంపీలకు చెప్పారు. జగన్ గురించి, వైసీపీ గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని .. సమయాన్ని రాష్ట్రాభివృద్ధి కోసం వెచ్చిస్తే మేలు జరుగుతుందని ఎంపీలు చెప్పారు. ఢిల్లీలో జగన్ ఏం చేస్తాడో అనేది ఇప్పుడు ముఖ్యం కాదని.. మనం ఏం చేయాలనేదే ముఖ్యం అని సీఎం చంద్రబాబు అన్నారు. జగన్ అంశా న్ని వదిలేసి.. రాష్ట్రం గురించి ఆలోచించాలని సూచించారు. పార్లమెంటరీ పార్టీ భేటీ తర్వాత ఎంపీలు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ఎంపీలు పన ?చేస్తామని ప్రకటిం చారు. జనగ్ గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు.

# మాకో పదవి కావాలి...

విజయవాడ, జూలై 22 కూటమిలో మిత్రపక్షంగా తిరుగులేని విజయం సాధించిన ఏపీ బీజేపీలో నామినేటెడ్ పదవులు ఎవరికి దక్కుతాయనే చర్చ మొదలైంది. ఇప్పటికే టీడీపీ, జనసేన తమ కోటాలో రెండు ఎమ్మెల్సీ స్థానాలు తీసుకోగా, భవిష్యత్‌లో ఏర్పడే ఖాళీలను తమకు కేటాయించాలని కోరుతోంది బీజేపీ? ఇక చాన్స్ వస్తే ఫస్ట్ తమ పేరే ఉండాలని బీజేపీ సీనియర్ నేతలు సోము వీర్రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ ఇద్దరూ గత ఎన్నికల్లో పోటీ చేయాలని భావించినా, పొత్తుల్లో వారికి సీట్లు దక్కలేదు. దీంతో నామినేటెడ్ కోటాలో ఎమ్మెల్సీ చాన్స్ ఇవ్వాలని కోరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.బీజేపీలో ఏ పదవులు భర్తీ చేయాలన్నా? ముందుగా పార్టీలో వారి నేపథ్యం గమనిస్తారు. బీజేపీ ఫస్ట్ అన్నట్లు?. తొలి నుంచి పార్టీలో ఉన్నవారికే ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. ఇలాంటి కోటాలోనే కేంద్ర సహాయమంత్రిగా భూపతిరాజు శ్రీనివాసరావు, రాష్ట్ర మంత్రిగా సత్యకుమార్ పదవులు దక్కించుకున్నారు. దీంతో ఎమ్మెల్సీలుగా తమకే ముందు అవకాశం వస్తుందని ఆశలు పెట్టుకుంటున్నారు విష్ణు, వీర్రాజు.ఇద్దరికీ సంఘ్ నేపథ్యం ఉండటంతో అధిష్ఠానం తప్పకుండా తొలి అవకాశమిస్తుందని ఆశిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఇద్దరికి పార్టీలోనూ ఎలాంటి పదవులు లేవంటున్నారు. వీర్రాజు గతంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా? ఎమ్మెల్సీగా పనిచేశారు. ఇక విష్ణువర్ధన్‌రెడ్డి పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. ఇద్దరికీ జాతీయస్థాయిలో పరిచయాలు ఉండటంతో తమకు పదవులు పక్కా అని అనుచరులతో చెబుతున్నారట?ఎమ్మెల్సీ పదవులను ఆశిస్తున్న వీర్రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి ప్రాంతీయ, సామాజిక సమీకరణలు కూడా తమకు అనుకూలంగా మల్చుకుంటున్నారని చెబుతున్నారు. వీర్రాజు గోదావరి జిల్లాలకు చెందిన కాపు సామాజికవర్గ నేత అయితే విష్ణు రాయలసీమ ప్రాంతానికి చెందిన రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారు. రాష్ట్రంలో ప్రధాన సామాజికవర్గాలైన ఈ రెండు కులాలకు ప్రాతినిధ్యం కల్పిస్తే పార్టీ బలోపేతమవుతుందని చెబుతున్నారట? పైగా రాయలసీమలో బీజేపీకి పెద్దగా పట్టులేకపోవడం వల్ల? తనకు చాన్స్ వస్తే ఆ ప్రాంతంలో పార్టీని విస్తరించే వీలుంటుందని పార్టీ పెద్దలకు వివరిస్తున్నారు విష్ణువర్ధన్‌రెడ్డి.ఇక రాష్ట్ర పార్టీ మాజీ అధ్యక్షుడైన వీర్రాజు? గతంలో ఎమ్మెల్సీగా పనిచేశారు. 2014లో టీడీపీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటైన సమయంలో ఎమ్మెల్సీ అవకాశం దక్కించుకున్నారు వీర్రాజు. టీడీపీ మద్దతుతో ఎమ్మెల్సీగా ఎన్నికైనా.. మిత్రపక్షాన్ని ప్రతిపక్షం కంటే ఎక్కువగా ఇబ్బంది పెట్టేవారని విమర్శలు ఆయనపై ఉన్నాయి. దీంతో ఇప్పుడు మళ్లీ అవకాశం ఇస్తారా? అనే చర్చ జరుగుతోంది.ఐతే పొత్తు ధర్మంలో పార్టీ ఎవరి పేరు సూచిస్తే వారికే అవకాశం ఇవ్వాల్సివుంటుందని? పార్టీకి తాను చేసిన సేవలు, పార్టీ పెద్దల సూచనల మేరకు నడుచుకున్న తనకు తగిన న్యాయం జరుగుతుందని నమ్మకం పెట్టుకుంటున్నారు వీర్రాజు. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికల్లో రాజమండ్రి అర్బన్ నుంచి పోటీ చేయాలని భావించారు వీర్రాజు. కానీ, ఆయనకు చాన్స్ దక్కలేదు. రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పోటీ చేశారు. దీంతో రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే రేసు నుంచి వీర్రాజు తప్పుకోవాల్సివచ్చింది. తన సీటు త్యాగం చేసినందున ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు వీర్రాజు.ఇక విష్ణు సైతం హిందూపురం ఎంపీగా పోటీ చేయాలని భావించారు. పొత్తుల్లో ఆ సీటు దక్కలేదు. దీంతో ఈ ఇద్దరూ పోటీకి దూరంగా ఉండిపోవాల్సివచ్చింది. దీంతో త్వరలో ఖాళీ అయ్యే ఎమ్మెల్సీ పదవుల్లో తొలి అవకాశం తమకు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ ఇద్దరి ఆశలను బీజేపీ హైకమాండ్ నెరవేరుస్తుందా? లేదా? అన్నదే పార్టీలో చర్చనీయాంశంగా మారింది. వీరిద్దరిని కూటమి నాయకత్వం అంగీకరించడం కూడా ముఖ్యమని మరికొందరు అంటున్నారు. మొత్తానికి ఇద్దరూ ప్రస్తుతానికి వెయిటింగ్ లిస్టులో ఉన్నట్లు ప్రచారం చేసుకుంటూ పార్టీ నాయకత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు.

# జిల్లా భూకబ్జాలపై విచారణ జరపాలి

### అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

బద్వేలు,కడప జిల్లాలో గత పది సంవత్సరాల నుంచి ప్రభుత్వ భూములను పాలకవర్గ పార్టీలు అయినా వైసీపీ టిడిపిలోని ప్రజాప్రతినిధుల బంధువులు రాజకీయ పలుకుబడి కలిగిన నాయకులు ఇతర ప్రాంతాల హైదరాబాద్ బెంగళూరు గుంటూరు కర్నూల్ ప్రకాశం తదితర జిల్లాలకు చెందిన డబ్బున్న వ్యక్తులు రెవెన్యూ ఉన్నతాధికారులు ప్రమేయంతో ప్రభుత్వ భూములు లక్షా 50 వేల ఎకరాలు జిల్లాలో అన్యక్రాంతమైన ఈ వాటిపై సమగ్ర విచారణ జరపాలని జిల్లా భూపోరాట సాధన కమిటీ కన్వీనర్ బి నారాయణ డిమాండ్ చేశారు ఆదివారం ఉదయం జిల్లా కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా భూకబ్జాలపై విచారణ జరపాలని రౌండ్ టేబుల్ సమావేశానికి అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు అయినా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుబ్రహ్మణ్యం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ బిఎస్పి పార్టీ జిల్లా నాయకులు గుర్రప్ప ముఖ్య ఉపన్యాసకులుగా మాట్లాడారు ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ అధ్యక్ష వహించారు జిల్లా భూపోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనర్ బి నారాయణ మాట్లాడుతూ వైసీపీ టిడిపి రెండు ప్రభుత్వాలు ఇప్పటికే పరిపాలించాయి వీరి పరిపాలనలో భూకబ్జాలు పెట్రేగిపోయాయని అన్నారు ఒంటిమిట్ట మండలం జోకుల పల్లె రెవెన్యూ పొలంలో 3000 ఎకరాలు పెన్నా పేరూరు రెవెన్యూ పొలం సర్వేనెంబర్ 661 లో వందల ఎకరాలు భూములు అన్య క్రాంతమైన అన్నారు సిద్ధవటం మండలం నాయకులు కడప ప్రజాప్రతినిధులు ఎస్టేట్లు ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ భూములను అనుభవిస్తున్నారన్నారు కాశినాయన మండలం అక్కింగుండ్ల రెవెన్యూ పొలంలో 2017 సంవత్సరం అప్పటి కలెక్టర్ బాబూరావునాయుడు ఆదేశాల మేరకు 6 మంది తాసిల్దార్లు ఆర్డీవో విచారించిన భూములు ఇప్పటికీ స్వాధీనం చేసుకోలేదన్నారు విలువ చేసే భూములు పలుకుబడి కలిగిన వారు ఆక్రమించుకున్నారన్నారు వారి పైన ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు బద్వేల్ దొంగ పట్టాలు సృష్టించే వారిపై కేసులు నమోదు చేశారు ఎఫ్ ఐ ఆర్ లో ప్రకటించిన వారందరిని అరెస్టు చేయకుండా ఒకరిద్దరిని మాత్రమే అరెస్టు చేసి తర్వాత పట్టించుకోలేదన్నారు జెడ్ హెచ్ డి సి సొసైటీ ద్వారా దళితులు బద్వేల్ గోపవరం అట్లూరు పోరుమామిళ్ల మైదుకూరు ఖాజీపేట మండలాలలో సాగు చేసుకుంటున్న భూములకు ఇప్పటికీ పట్టాలి ఇవ్వలేదు అన్నారు ప్రభుత్వపరంగా రైతు భరోసా సబ్సిడీలు పంట నష్టపరిహారం ఇన్సూరెన్స్ సౌకర్యాలు నోచుకోలేదన్నారు దళితులు సొసైటీ భూముల ద్వారా సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములను వైసీపీ ప్రభుత్వం ప్లే వుడ్ ఫ్యాక్టరీ యజమానులకు వందల ఎకరాలు అప్పజెప్పారు అదే విధంగా అన్నమయ్య డెవలప్మెంట్ అథారిటీ పేరుతో హెచ్ డి సి భూములు కూడా స్వాధీనం చేసుకున్నారు 30 ఏళ్ల నుంచి పంటలు వేసుకుంటూ అనుభవిస్తున్న దళిత కుటుంబాలను నేడు రోడ్లపాల్లో అయినారు సీకే దీన్నే మండలం కడప నగర పరిధిలో పుట్లంపల్లి రిమ్స్ పరిసర ప్రాంతాలు బుద్ధ టౌన్ షిప్ భావన టౌన్షిప్ తదితర ప్రభుత్వ భూములలో లేఅవుట్లు వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం కార్పొరేషన్ పాలకవర్గ సభ్యులు రాజకీయ నాయకులు ఈ పని తప్ప ఇంకొకటి ప్రజా సమస్యలు పట్టడం లేదన్నారు

# మీ భర్త ఎవరో చెప్పండి..

### దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శాంతికి నోటీసులు
### రికార్డుల్లో భర్త పేరు మదన్మోహన్గా పేర్కొన్నారంటూ శాంతికి నోటీసులు
### మీడియా సమావేశంలో భర్త పేరు మరొకటి చెప్పడంపై వివరణ కోరిన ప్రభుత్వం
### ప్రభుత్వ అనుమతి లేకుండా మీడియా సమావేశం నిర్వహించడంపై అభ్యంతరం
### శాంతిపై కొత్తగా తొమ్మిది అభియోగాలు నమోదు చేసిన ప్రభుత్వం

విజయవాడ,సస్పెన్షన్లో ఉన్న దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శాంతికి ప్రభుత్వం తాజాగా నోటీసులు జారీ చేసింది. ఆమె భర్త ఎవరనే విషయంలో స్పష్టత కోరుతూ దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ నోటీసులు పంపారు. "దేవాదాయ శాఖలో 2020లో ఉద్యోగంలో చేరినప్పుడు భర్త పేరు కె. మదన్మోహన్ అని సర్వీస్ రిజిస్టర్లో ఆమె నమోదు చేయించారు. గత ఏడాది జనవరి 25న ప్రసూతి సెలవుల కోసం దరఖాస్తు చేసినప్పుడు కూడా భర్త పేరు మదన్మోహన్ అని పేర్కొన్నారు. కానీ ఈ నెల 17న నిర్వహించిన విలేకరుల సమావేశంలో పి.సుభాష్ అనే వ్యక్తిని పెళ్లి చేసుకున్నట్టు తెలిపారు. విడాకులు తీసుకోకుండా రెండో పెళ్లి చేసుకోవడం ఉద్యోగి ప్రవర్తనా నియమావళికి విరుద్ధం. దీనిపై 15 రోజుల్లో సమాధానం చెప్పాలి" అని నోటీసుల్లో పేర్కొన్నారు. ఆమె తీరుతో దేవాదాయశాఖ ప్రతిష్ఠకు భంగం కలిగిందని, దీనిపై వివరణ ఇవ్వాలని కోరారు. ఇప్పటికే శాంతిపై వివిధ ఆరోపణలు రావడంతో ఈ నెల 2న సస్పెండ్ చేసి తొమ్మిది అభియోగాలు నమోదు చేశారు.ఇటీవలఆమె నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రస్తావించిన అంశాలు, ఉమ్మడి విశాఖ జిల్లాలోసహాయ కమిషనర్గా ఉన్నప్పుడు చేసిన ఉల్లంఘనలకు సంబంధించి కొత్తగా ఆరు అభియోగాలు మోపారు.

# అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పెరుగుతున్న వరద ఉధృతి

### కాజ్ వే లపైకి చేరిన వరద నీరు
### అప్రమత్తం అయిన జిల్లా అధికారులు,
### సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన జిల్లా కలెక్టర్

కోనసీమ,జిల్లాలో వరద ఉధృతి పెరిగింది. పలు చోట్ల వరద నీరు కాజ్ వే లపైకి చేరింది. దాంతో జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ అధికారులను అప్రమత్తం చేసారు. సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.సోమవారం జరగాల్సిన గ్రీవెన్స్ ను కలెక్టర్ రద్దు చేసారు. పి.గన్నవరం మండలంలో కాజ్ వే లపైకి వరద నీరు చేరింది. ఉధృతికి చాకలిపాలెం - కన కాయలంక కాజ్వే మునిగింది. కోనసీమ - పశ్చిమగోదావరి జిల్లాల రాకపోకలు నిలిచిపోయాయి. అయినవిల్లి మండలం ముక్తేశ్వరం ఎదురు బిడియం కాజ్ వే పైకి వరద నీరుచేరింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. 45 లంక గ్రామాలపైవరద ప్రభావం చూపనుంది. వరద తీవ్రత ఎక్కువగా ఉంటుందని అధికారులు 24 అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు.

# ఎన్టీఆర్ జిల్లాలో గోవులఅక్రమ రవాణా అడ్డుకున్న పోలీసులు

నందిగామ , నందిగామ వై జంక్షన్ వద్ద 2 డీసియమ్ వ్యాన్లలో 35 గోవులను అక్రమంగా రవాణా చేస్తుండగా సి.ఐ హనీష్ పట్టుకున్నారు. కృష్ణాజిల్లా ఆగిరిపల్లి నుండి హైదరాబాదు కబేలాకు 35 అవులు తరలిస్తున్నట్లుగా గుర్తించారు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని డీసియమ్ వ్యాన్ స్వాధీనం చేసుకొని గోవులను గోశాల కి తరలించారు. ఎన్ని ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన గోవులను రక్షించలేకపోతున్నారని గోవులు లేకపోతే సృష్టినాశనం తప్పదని కొన్ని మతాలపండగల పేర్లతో గోవులను వధిస్తున్నారని మండిపడ్డారు గోవుల సంరక్షణ సమితి అధ్యక్షుడు వందేమాతరం అశోక్.

# సమస్యల పరిష్కారానికి పోస్టు కార్డు ద్వారా వినతిపత్రాలు

## వడ్డెర సంఘం నాయకులు




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 22- రాష్ట్ర వడ్డెర సంఘం ఐక్య మత్యంతో జాతీయ కార్యదర్శి శిల్పి సుబ్బరాయుడు. సునీల్ వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి చల్లా వెంకటేష్. రాష్ట్ర కార్యదర్శి వడ్డెర గోపాలు సంపంగి శివ భాస్కర్ పల్లపు రాము వడ్డేర మహేష్ సుబ్బలచ్చుమ్మ రూప అనురాధ నంద్యాల జిల్లా కార్యదర్శిలు అందరూ కలిసి కట్టుగా నంద్యాల లోని పోస్టు కార్డు ద్వారా సీఎం కు. ఉప సీఎం కు. మంత్రి కి. ఎంపీ కి ఎమ్మెల్యే లకు శనివారం వినతిపత్రాలు పోస్టు కార్డు ద్వారా పంపడం జరిగిందన్నారు . వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో 2024 ఎన్నికల్లో విజయాన్ని సాధించిన కూటమి ప్రభుత్వానికి ఈ అఖండ విజయానికి వడ్డెర సంగం కూడా కృషి చేసిందన్నారు. ఎన్నికల ముందు హామీలలో వడ్డే ఓబన్న గారి జయంతిని అధికారికంగా నిర్వాణ చేయాలని కోరారు. ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీ తీర్మానం చేయాలని కోరారు. మరియు రాళ్లు కొట్టి రోడ్లు వేసి కొండను కూడా రోడ్లుగా మొలిచి రోడ్లు వేయడం భవనాలు కట్టడం గడ్డపారలు ఉల్లులు సూక్తులు మూలన పడటంతో పక్క రాష్ట్రాలకు వలసలు పోయే పరిస్థితి ఏర్పడిందని దీనితో వంశపరముగా కులావృత్తిని ఆధారంగా పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్న వడ్డెర కులస్తులకు నంద్యాల జిల్లాలోని టిడ్కో ఇళ్లలో కొన్ని ఇల్లు పంపిణీ చేయాలన్నారు. బంజరు భూములను కుటుంబానికి ఎకరాలు చొప్పున భూ పంపిణీ చేయాలన్నారు. నంద్యాల జిల్లాలో వడ్డెర సంఘానికి 650 చదరపు గజాలు స్థలం ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో సొసైటీలు ఏర్పాటు చేసుకున్న వారికి వడ్డెర ఫెడరేషన్ ద్వారా నలభై లక్షలు రూపాయలు కేటాయించాలని సబ్సిడీ 20 లక్షలు తీసివేయాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

## నేడు మహానంది దేవస్థాన హుండీ లెక్కింపు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 22-మహానంది పుణ్యక్షేత్రం లో ఈనెల 23న ఉదయం దేవస్థాన హుండీ లెక్కించనున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాస రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు . అభిషేక మండపంలోమంగళవారంఉదయం7గంటలనుంచి ఉభయ దేవాల యాల హుండీ లెక్కింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, ఏజెన్సీ వర్కర్స్, తదితరులు పాల్గొనాలని కోరారు.

# పైన ఖాళీ వెసేయ్ పాగ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతి నిధి జూలై 22-ఖాళీ స్థలం కనిపిస్తే చాలు ఇక్కడి వాసులు రాత్రిరాత్రే నిర్మాణాలు చేపడుతున్నారు. గాంధీ చౌక్ కూరగాయల మార్కెట్ ప్రక్కన మున్సిపాలిటీకిసంబంధించిన షాపుల ు ఉన్నాయి. ముందర ఉన్న షాపు పై రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టారు. అక్రమ నిర్మాణాలు మున్సిపాల్టీకి సంబంధించిన షాపులు రూపు రేఖలు మారుతాయని పలువురు ప్రశ్నిస్తు న్నారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోకుంటే శాశ్వత నిర్మాణాలు చేపడతారని స్థాని కులు ఆరోపిస్తు న్నారు. ఈ విషయంపై టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహ మూర్తి ని వివరణ కోరగా వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు

## పాతపేట హైస్కూల్ నందు శిక్షా సప్తాహ్ ప్రారంభం.....

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-డోన్ పట్టణం పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు శిక్షా సప్తాహ్ లో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయుల సహకారం తో వివిధ కృత్యాలను తయారు చేసి ప్రదర్శించినట్లు ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. విద్యార్థులు ఈకో సిస్టం తయారీ, నీటి చక్రం, ఊపిరితిత్తుల నమూనా, వివిధ రకాల కణాల చార్ట్, సౌరశక్తి నమూనా, పుష్పం వాటి భాగాలు, జంతుకణం నమూనా, టార్షియా ఫజిల్ లాంటి అనేక కృత్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రవి శేఖర్, వెంకట సుబ్బారాయుడు ,రఘునాథ్, ఎస్తేరమ్మ, శ్రీనివానులు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.




# జిల్లా పోలీసు "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ" కార్యక్రమానికి 115 ఫిర్యాదులు ... జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా.




- - విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 22-నంద్యాల జిల్లా బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఫిర్యాదిదారుల నుంచి 115 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ఫిర్యాదిదారుల సమస్యలను జిల్లా ఎస్పీ గారు అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్ లో మాట్లాడి చట్టపరిధిలో ఫిర్యాదిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని , ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని , ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరించరాదని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ లో మాట్లాడి పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యాక్రమంలో సివిల్ తగాదాలు,కుటుంబ కలహాలు, అన్నదమ్ముల ఆస్థి పంపకాలలో మనస్పర్ధలు మొదలగునవి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రవీంద్ర , తాలూకా ఇన్స్పెక్టర్ దస్తగిరిబాబు పాల్గొన్నారు.

# 90 శాతం కు పైగా రెవెన్యూ శాఖ సమస్యలే

## ---పిజిఆర్ఎస్ కు 201 ఫిర్యాదులు
## --జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 22-ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్వీకరించిన ప్రజా ఫిర్యాదులను మనసు పెట్టి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా నలుమూల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. డిఆర్ఓ ఎ.పద్మజ, జిల్లా అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించి ప్రతి ఫిర్యాదును మనసు పెట్టి పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. మండల పరిధిలో శాఖల సమన్వయ లోపం వల్లే జిల్లా కేంద్రానికి అధిక సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని... డివిజనల్, మండల స్థాయి సిబ్బందితో సమస్యలను ఎందుకుకు పరిష్కరించలేకపోతున్నారని కలెక్టర్ ప్రశ్నించారు. ఫిర్యాదుదారుడు ఇచ్చిన అర్జీని కూడా చదవలేని స్థితిలో కొంతమంది అధికారులు ఉన్నారని.ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా అధ్యయనం చేసుకొని పరిష్కార మార్గం చూపాలన్నారు. వానాకాలంలో వచ్చే వ్యాధులపై దృష్టి సారించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వర్షాలు కొనసాగుతున్నందున జలమయమవుతున్న లోతట్టు ప్రాంతాలను పరిశీలించి ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. తాను తనిఖీలు నిర్వహించిన ప్రాంతాల్లో పారిశుధ్య లోపాలున్నట్లు గమనించానని పంచాయతీ అధికారులు, ఎంపీడీఓలు, మునిసిపల్ అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకొని చెత్తను డంప్ యార్డులకు తరలించాలన్నారు. పరిపాలనకు సంబంధించిన అన్ని దస్త్రాలు ఈ ఆఫీస్ ద్వారానే సర్క్యూలేట్ కావాలని జిల్లా అధికారులను ఆమె ఆదేశించారు. 102 లోకాయుక్త కేసులు, 150 హైకోర్టు కేసులు ఏ ఏ కారణాల వల్ల పెండింగ్లో ఉన్నాయని సంబంధిత వివరాలన్నింటినీ వచ్చే సోమవారానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. త్రాగునీరు కలుషితమై సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో పాటు ఓఆర్హెచ్ఎస్ ట్యాంకులను శుభ్రం చేసి తగు మోతాదులో క్లోరినేట్ చేసిన నీటినే సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. ట్యాంకులను శుభ్రం చేసిన తేదీలను అందరికీ కనపడేటట్లు ప్రదర్శించాలన్నారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై సమగ్ర నివేదికలను 3 రోజుల్లో ఇవ్వాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద 6000 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించే దిశలో చర్యలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. పిజిఆర్ఎస్ లో 90 శాతానికి పైగా రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులే వస్తున్నాయన్నారు. మండల సర్వేయర్లు, వీఆర్వోల పైన అత్యధికంగా ఫిర్యాదులు రావడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 201 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరిం చాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

## మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి...




విభారే న్యూస్ డోన్ మా ప్రతినిది .:-మెప్మా ఆర్పి లకు ఉద్యోగ భద్రత కల్పించాలని గత ప్రభుత్వం విడుదల చేసిన మూడు సంవత్సరా ల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని వేతనాలకి పనికి ముడి పెట్టకుండా పదివేల రూపాయల వేతనం చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం,మండల అధ్యక్షులు పి.రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం స్థానిక నెహ్రూ నగర్ లో ఏపీ మెప్మా ఆర్పి ఉద్యోగుల యూనియన్ పట్టణ కమిటీ సమావేశం ఆ యూనియన్ అధ్యక్షురాలు సుజాత అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో గత 20 ఏళ్లుగా పని చేస్తున్నటువంటి ఆర్పిల కు కనీస వేతనాలు చెల్లించకుండా ఉద్యోగ భద్రత లేకుండా ఎస్ ఎల్ ఎఫ్ ఉద్యోగులైనప్పటికీ ప్రభుత్వమే వీరిపై పెత్తనం చెలాయించి పొదుపు సంఘాల మహిళలకి ఎలాం టి హక్కులు లేకుండా చేయటం అన్యాయమని వారు అన్నారు. నిలుపుదల చేసిన ఆర్పీ కళ్యాణి మొబైల్ లాగిన్ వెంటనే పునరుద్ధరించాలని వారు కోరారు.మెప్మా అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఆర్పీలపై పెత్తనం చలాయిస్తూ మొబైల్ లాగిన్స్ నిలుపుదల చేసి వాళ్లని మానసికంగా హింసిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.గత ప్రభుత్వం పదివేల రూపాయలు వేతనం చెల్లిస్తామని జీవో విడుదల చేసినప్పటికీ గ్రేడింగ్ విధానం ద్వారా ఎవరికీ పదివేల రూపాయల వేతనం రావడం లేదని మూడు నుంచి ఐదు వేల లోపు మాత్రమే చెల్లిస్తున్నారని ఇది సరైనది కాదని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని జీవో ను మార్పు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.మూడు నెలలుగా బకాయి ఉన్న వేతనాలని వెంటనే చెల్లించాలని,రాజకీయ వేధింపులు తొలగింపులు ఆపాలని,గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలని,పదివేల రూపాయల వేతనం ప్రభుత్వ నుండే చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ సమస్యల పరిష్కారం కోసం రాబోవు కాలంలో ఆందోళన పోరాటాలకు మెప్మా ఆర్పిలు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నునీత,రమాదేవి,శశికళ,మంగమ్మ,మణి,నూర్జహాన్,చాంద్ బి,సాధిక,జరీనా,చిన్న మహబూబ్ బి,ఈరమ్మ,కుమారి పాల్గొన్నారు.

# మురుగు పరుగు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 22. గత వైకాపా పాలనలో వైయస్ ఆర్ నగర్ లో సీసీ రోడ్డు నిర్మించినప్పుడు మురుగు నీరు పారుదలకు సిమెంట్ పైపులు వేయకుండా నిర్లక్ష్యం చేశారు. దీంతో కాల్వల్లో మురుగు బయటకు పోకుండా ఒకే చోట నిల్వ ఉంటూ నివాసితులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ఎన్నికల సమయంలో కాలనీలో అవస్థలు చూసి చాలా బాధ పడ్డారని కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పైపు లైన్. రోడ్డు మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చారని మాట ప్రకారం వైయస్ ఆర్ నగర్ లో రోడ్డు మరమ్మతులు. పైపు లైన్ పనులు చేస్తున్నామని తెలుగుదేశం పార్టీ నాయకులు దేరెడ్డి శివ నాగిరెడ్డి అన్నారు. యుద్ధప్రాతిపదికన అధికారులు సమస్యలను పరిష్కరించారని తెలిపారు. వైయస్ ఆర్ నగర్ లో ఉన్న ప్రజల టిడిపి నాయకులు దేరెడ్డి శివ నాగిరెడ్డి ఎన్ ఎమ్ డి ఫిరోజ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఒక్కరే వచ్చారు




-విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 22-'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంపై మున్సిపాల్టీ అధికారులు ప్రచారం కల్పించడంలో విఫలమయ్యారు. సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్న సమాచారం చాలామందికి తెలియకపోవడంతో స్పందన కరవైంది. ఒకే ఒక వ్యక్తి మాత్రమే అర్జీ ఇచ్చారు. ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం కల్పించాల్సిన మున్సిపాల్టీ అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపాల్టీ లో 44వార్డు సచివాల యాలు ఉన్నాయి. వీటి పరిధిలోని ప్రజలకు సమాచారం చేరవేసినా చాలామంది సద్వినియోగం చేసుకునే వారు. కానీ సచివాలయ సిబ్బంది ప్రజలకు చేరవేయడం లేదని పలువురు తెలియజేస్తున్నారు.

## స్టాంపులను అధిక ధరలకు విక్రయిస్తే వారి లైసెన్సులను రద్దు చేస్తాం... సబ్ రిజిస్టార్



ఆళ్లగడ్డ ప్రతినిధి జూలై 22 విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో కొందరు స్టాంప్ రైటర్లు అధిక ధరలకు స్టాంపులను విక్రయిస్తున్నట్లు కొన్ని పత్రికలలో వచ్చిన వార్తలు అవాస్తవమని ఆళ్లగడ్డ సబ్ రిజిస్టార్ అబ్దుల్ సత్తార్ స్పష్టం చేశారు.తమ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం 2.0 విధానం ద్వారా ఈ -స్టాంపింగ్ విధానాన్ని అమలు చేస్తున్నదని ఈ విధానం వచ్చిన తర్వాత ఎటువంటి లొసుగులకు తావు లేదని సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్ సత్తార్ తెలిపారు.ఈ స్టాంపింగ్ విధానం ద్వారా ఆళ్లగడ్డ పరిధిలో 12 మంది స్టాంప్ రైటర్లకు లైసెన్సు లు జారి చేయడం జరిగిందన్నారు. ఈ స్టాంపింగ్ కు సంబంధించి జిల్లాకు నర్సిరెడ్డి అనే వ్యక్తి మేనేజర్ గా ఉన్నారన్నారు.ఈ స్టాంపు లను ఎవరైనా అధికారులకు విక్రయిస్తే మేనేజర్ దృష్టికి కానీ, తమ దృష్టికి కానీ తీసుకొని రావాలన్నారు. స్టాంపులను అధిక ధరలకు విక్రయించినట్లు తెలిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి వెంటనే వారి లైసెన్సులను రద్దు చేస్తామని సబ్ రిజిస్టర్ అబ్దుల్ సత్తార్ హెచ్చరించారు.ఎక్కడైనా ఏదైనా లోటుపాట్లు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకుని రావాలని ఆయన సూచించారు. మ్యారేజ్ రిజిస్ట్రేషన్ కూడా ఆన్లైన్ విధానం ద్వారానే దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. మ్యారేజ్ సర్టిఫికెట్ల విధానంలో కూడా ఎక్కడ ఎలాంటి అవకతవకలు జరిగేందుకు ఆస్కారం లేదని ప్రభుత్వం నిర్దేశించిన చలానా మాత్రమే చెల్లించాలని ప్రజలకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొని వస్తే చర్యలు తీసుకుంటామని సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్ సత్తార్ పేర్కొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**